దిగుమతి సుంకాల్ని తగ్గించాలి

ఐసీఈఏ

న్యూఢిల్లీ, జనవరి 10: మొబైల్ ఫోన్ విడిభాగాలపై దిగుమతి సుంకం తగ్గింపు.. దేశీయంగా మొబైల్ ఫోన్ల ఉత్పత్తిని పెంచగలదని ఇండియా సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) చైర్మన్ పంకజ్ మహీంద్రూ బుధవారం అన్నారు. ఆయా దేశాల నుంచి భారత్‌కు వస్తున్న మొబైల్ ఫోన్ కంపోనెంట్స్‌పై ఇంపోర్ట్ డ్యూటీస్‌కు కోత పెడితే 28 శాతం వృద్ధితో 2027కల్లా స్థానిక ఉత్పత్తి 82 బిలియన్ డాలర్లను తాకవచ్చని అభిప్రాయపడ్డారు. ఎగుమతులు 39 బిలియన్ డాలర్లకు పెరగడానికీ ఇది దోహదపడగలదన్న ఆశాభావాన్ని ఆయన వెలిబుచ్చారు. కాగా, గత ఆర్థిక సంవత్సరం (2022–23) భారతీయ స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు ఏకంగా 100 శాతం ఎగిసి 11.1 బిలియన్ డాలర్లకు చేరిన సంగతి విదితమే. ఇక ఈ ఆర్థిక సంవత్సరం (2023–24) 15 బిలియన్ డాలర్లకు వెళ్తాయన్న అంచనాలున్నాయి. ఐసీఈఏలో యాపిల్, ఫాక్స్‌కాన్, డిక్సాన్, వివో, ఒప్పో, షియామీ, లావా తదితర కంపెనీలకు సభ్యత్వం ఉన్నది తెలిసిందే.

ఆశల జెట్.. అంతులేని వ్యథ

అవినీతి ఆరోపణలతో మసకబారిన నరేశ్ గోయల్ వైభవం

జైలు గోడల మధ్య జెట్ ఎయిర్‌వేస్ బాస్

ఒకప్పుడు భారతీయ విమాన యాన రంగాన్నే శాసించిన చరిత్ర. దేశంలోని టాప్–20 ధనవంతుల్లో ఒకరిగా గుర్తింపు. కార్పొరేట్ ప్రపంచంలో ఆయన ప్రతీ అడుగు ఓ సంచలనమే. ఎందరికో మార్గదర్శి.. మరెందరికో ఉద్యోగ–ఉపాధి ప్రదాత.

ఇప్పుడు మోసం–అవినీతి ఆరోపణలు. వేలాది మందిని రోడ్డున పడేశారన్న అపఖ్యాతి. దేశం విడిచి వెళ్లకుండా ఆంక్షలు. కుటుంబానికి దూరమై జైలులో దుర్భర జీవితం. చచ్చిపోతా.. అనుమతించండంటూ కోర్టుకు విజ్ఞప్తులు.

ఇదీ.. జెట్ ఎయిర్‌వేస్ అధిపతి నరేశ్ గోయల్ దుస్థితి.

ముంబై, జనవరి 10: జీవితంపై విరక్తి చెంది.. చావును ప్రసాదించాలంటూ చేతులు జోడించి వేడుకుంటున్నారు 75 ఏండ్ల జెట్ ఎయిర్‌వేస్ అధిపతి నరేశ్ గోయల్. దశాబ్దాల తరబడి కార్పొరేట్ ప్రపంచంలో సంపాదించుకున్న పేరు, ప్రతిష్ఠలు.. అవినీతి ఆరోపణలతో కనుమరుగైపోయాయి. ఓవైపు క్యాన్సర్ బారిన పడ్డ భార్య ఇప్పుడా.. అప్పుడా అన్నట్టు ఉండటం, మరోవైపు జైల్లో తన పరిస్థితి దుర్భరంగా మారటం, ఇంకోవైపు సంతానాన్నీ అనేక సమస్యలు వేధిస్తుండటంతో నాకీ బతుకు వద్దని కన్నీటి పర్యంతమవుతూ మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) ప్రత్యేక కోర్టును బతిమాలుకునే స్థాయికి గోయల్ దిగజారిపోయారు. నేను నిర్దోషిని అంటూ బోరున విలపించారు. దీంతో గోయల్ మానసిక పరిస్థితిని గమనించాలని, ఆయన ఆరోగ్యంపైనా శ్రద్ధ వహించాలని ఆయన తరపు న్యాయవాదులకు న్యాయమూర్తి ఎంజీ దేశ్‌పాండే సూచించారు. తదుపరి విచారణను ఈ నెల 16కు వాయిదా వేశారు.

భార్యను చూసేందుకు..

గోయల్ పరిస్థితిని మానవీయ కోణంలో చూసిన కోర్టు.. క్యాన్సర్‌తో పోరాడుతున్న తన భార్యను చూసేందుకు, అలాగే వైద్య నిపుణులను కలిసేందుకు ఆయనకు అనుమతినిచ్చింది. పోలీసు భద్రత నడుమే ఇదంతా జరుగాలన్నది. ఇక తన వ్యక్తిగత వైద్యులతో చికిత్సకున్న అవకాశాల్నీ పరిశీలించి, తగు చర్యలు తీసుకోవాలనీ జైలు అధికారులను ఆదేశించింది.

కోర్టు విచారణ అనంతరం తిరిగి జైలుకు వెళ్తున్న నరేశ్ గోయల్

ఇదీ నేపథ్యం..

1949 జూలై 29న పంజాబ్‌లోని సంగ్రూర్‌లో ఓ నగల వ్యాపారి ఇంట్లో నరేశ్ గోయల్ జన్మించారు. చిన్నతనంలోనే తండ్రి చనిపోవడంతో గోయల్‌కన్నీ కష్టాలే. ఆరో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలోనే చదువు సాగింది. ఈ క్రమంలో 11 ఏండ్ల వయసులో గోయల్ ఇంటిని అప్పులిచ్చినవాళ్లు వేలం వేశారు. అయినప్పటికీ ఎలాగోలా పాటియాలా సర్కారీ కళాశాలలో బీకాం పూర్తయ్యింది. 1967లో తన మేనమామ సేథ్ చరణ్‌దాస్ రామ్ లాల్స్ ట్రావెల్ ఏజెన్సీ ఈస్ట్ వెస్ట్ ఏజెన్సీస్‌లో క్యాషియర్‌గా ఉద్యోగ జీవితం మొదలైంది. నెలకు రూ.300 జీతం. ఈ నేపథ్యంలోనే కామర్స్ చదివిన గోయల్‌కు పలు విదేశీ విమానయాన సంస్థల్లో పనిచేసేందుకు అవకాశాలు లభించాయి. 1969లో ఇరాకీ ఎయిర్‌వేస్ పబ్లిక్ రిలేషన్ మేనేజర్‌గా నియమితులయ్యారు. 1971 నుంచి 1974 వరకు రాయల్ జోర్డానియన్ ఎయిర్‌లైన్స్, మిడిల్ ఈస్ట్ ఎయిర్‌లైన్స్‌ల్లోనూ పనిచేశారు. ఆ తర్వాత తనకున్న ట్రావెల్ ఏజెన్సీ అనుభవంతో తల్లి నుంచి కొంత నగదును తీసుకుని 1974లోనే జెట్ ఎయిర్ పేరిట సొంతంగా ఓ ట్రావెల్ ఏజెన్సీని పెట్టారు. ఎయిర్ ఫ్రాన్స్, ఆస్ట్రియన్ ఎయిర్‌లైన్స్, క్యాథే పసిఫిక్ వంటి భారీ సంస్థలతో కలిసి సాగారు. ఇదే సమయంలో 1975లో దేశంలోని ఫిలిప్పీన్స్ ఎయిర్‌లైన్స్ రీజినల్ మేనేజర్‌గా నియమితులయ్యారు. అలాఅలా.. 1992 ఏప్రిల్ 1న ముంబై కేంద్రంగా జెట్ ఎయిర్‌వేస్‌ను స్థాపించారు. గోయల్‌కు భార్య, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు.

> **చచ్చిపోవాలనుంది..**
>
> *నేను జీవితంపై అన్ని ఆశల్నీ కోల్పోయాను. ఈ పరిస్థితిలో ఇలా బతికే కన్నా చావడం మేలు. జైల్లోని ఇతర ఖైదీలతో కలిసి జేజే ప్రభుత్వ దవాఖానకు వెళ్తున్నాను. అక్కడ లైన్లలో నిలబడి వైద్యం చేయించుకోవాల్సి వస్తున్నది. ఇది నావల్ల కావడం లేదు. కోర్టు విచారణలకు హాజరయ్యేందుకు కూడా నా ఆరోగ్యం సహకరించడం లేదు. శరీరం మొత్తం వణికిపోతున్నది. నిలబడేందుకూ ఇంకొకరి సాయం కావాల్సి వస్తున్నది. దయచేసి జైల్లోనే చచ్చిపోయేందుకు నాకు అనుమతివ్వండి. అందుకు బదులుగా నన్ను ఆ దవాఖానకే పంపించాలని మాత్రం ఆదేశించకండి.*
>
> *–కోర్టులో న్యాయమూర్తిని కన్నీటితో వేడుకున్న గోయల్*

ఏమిటీ కేసు?

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ కెనరా బ్యాంక్‌లో రూ.538 కోట్ల మోసానికి పాల్పడ్డారని నరేశ్ గోయల్, ఆయన భార్య అనిత తోసహా ఇతర జెట్ ఎయిర్‌వేస్ మాజీ ఉద్యోగులపై కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. దీని ఆధారంగానే మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసు దాఖలు చేసింది. బ్యాంక్ రుణ నిధులను మళ్లించారని, వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నారని ఆరోపించింది. ఈ క్రమంలోనే గత ఏడాది సెప్టెంబర్ 1న గోయల్ అరెస్టయ్యారు. ప్రస్తుతం ముంబైలోని ఆర్థర్ రోడ్ జైలులో జ్యూడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఈడీ అరెస్టును సవాల్ చేస్తూ వేసిన పిటిషన్‌ను నిరుడు నవంబర్‌లో బాంబే హైకోర్టు కొట్టేసింది. అంతకుముందు సెప్టెంబర్‌లో అనారోగ్య సమస్యల్ని ఎదుర్కొంటున్న తన వైద్యానికి తమ కుటుంబ వైద్యులను, తిండికి ఇంటి భోజనాన్ని అనుమతించాలంటూ చేసిన అభ్యర్థనను ఈడీ ప్రత్యేక కోర్టు తిరస్కరించింది.

270 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై, జనవరి 10: నష్టాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు చివర్లో మదుపరులు కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో లాభాల్లో ముగిశాయి. బ్లూచిప్ సంస్థలైన రిలయన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు కొనుగోళ్లు జరపడంతో భారీ నష్టాల నుంచి లాభాల్లోకి వచ్చాయి. ఈవారంలోనే పారిశ్రామిక వృద్ధిరేటు, ద్రవ్యోల్బణ గణాంకాలు విడుదలకానుండటంతో పెట్టుబడిదారులు వేచి చూసే ధోరణి అవలభించారు. ఫలితంగా నష్టాల్లో కదలాడిన సూచీలకు మధ్యాహ్నం తర్వాత అంతర్జాతీయ సూచీలు లాభాల్లో ముగియడం జోష్‌నిచ్చింది. 71,110.98 పాయింట్ల నుంచి 71,733.84 పాయింట్ల మధ్య కదలాడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ చివరకు 71,657.71 వద్ద ముగిసింది. దీంతో 271.50 పాయింట్లు లాభపడినట్టు అయింది. నిఫ్టీ సైతం 73.85 పాయింట్లు అందుకొని 21,618.70 వద్ద ముగిసింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.69 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు హెచ్‌సీఎల్ టెక్, ఐసీఐసీఐ బ్యాంక్, టాటా మోటర్స్, విప్రో, ఇండస్‌ఇండ్ బ్యాంక్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, విప్రో, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, టైటాన్ షేర్లు కూడా లాభాల్లో ముగిశాయి. కానీ, ఎన్‌టీపీసీ, పవర్‌గ్రిడ్, అల్ట్రాటెక్ సిమెంట్, యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫోసిస్, నెస్లె షేర్లు నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే సేవలు, కన్స్యూమర్ డ్యూరబుల్, హెల్త్‌కేర్, ఇండస్ట్రీయల్స్ షేర్లు లాభాల్లో ముగియగా..ఎఫ్‌ఎంసీజీ, టెలికం, యుటిలిటీ, రియల్టీ, పవర్ రంగ షేర్లు నష్టపోయాయి.

రూపాయి అప్

ముంబై, జనవరి 10: వరుసగా ఆరో రోజు రూపాయి పెరిగింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 10 పైసలు పెరిగి 83.03కి చేరుకున్నది.



దేశ ఆర్థిక పరిస్థితులు ఆశాజనకంగా ఉండటంతో కరెన్సీకి ఊపునిచ్చింది. 83.13 వద్ద ప్రారంభమైన డాలర్–రుపీ రేటు ఒకదశలో 82.97 నుంచి 83.18 శ్రేణిలో కదలాడింది. చివరకు 10 పైసలు బలపడింది.

20 వేలు తగ్గిన ఏథర్ 450ఎస్

న్యూఢిల్లీ, జనవరి 10: ఎలక్ట్రిక్ స్కూటర్లను కొనుగోలు చేసేవారికి ఏథర్ ఎనర్జీ శుభవార్తను అందించింది. తన ఎంట్రీలెవల్ 450 ఎస్ మాడల్ ధరను రూ.20 వేల వరకు తగ్గించినట్టు ప్రకటించింది. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ఉన్న కస్టమర్లను ఆకట్టుకోవాలనే ఉద్దేశంతో సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నది. దీంతో ఏథర్ 450 ఎస్ స్కూటర్ ధర బెంగళూరులో రూ.1,09,000కి తగ్గగా, అదే ఢిల్లీలో రూ.97,500కి దించింది. దీంతోపాటు 450 ఎస్‌ప్రొ ప్యాక్ మాడల్‌ను సైతం రూ.25 వేలు దించింది. దేశవ్యాప్తంగా కంపెనీ వాహనాలకు డిమాండ్ అంతంతమాత్రంగానే ఉండటం వల్లనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తున్నది. 2.9 కిలోవాట్ల బ్యాటరీ రీచార్జితో 115 కిలోమీటర్లు ప్రయాణించవచ్చును. కేవలం 3.9 సెకండ్లలో 40 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ మాడల్ గంటకు 90 కిలోమీటర్లు ప్రయాణించవచ్చును. బ్యాటరీపై ఐదేండ్లు లేదా 60 వేల కిలోమీటర్ల వ్యారెంటీ సదుపాయం కల్పిస్తున్నది.

బిగ్‌'సి'లో సంక్రాంతి ఆఫర్లు

హైదరాబాద్, జనవరి 10: ప్రముఖ మొబైల్ విక్రయ సంస్థ బిగ్‌'సి'..సంక్రాంతి పండుగ ఆఫర్లు ప్రకటించింది. వినియోగదారులకు ఆకర్షణీయమైన ఆఫర్లు అందించడానికి సంస్థ ఎల్లప్పుడూ ముందుంటదని, ఈ పండుగ సందర్భంగా షోరూంలో మొబైల్ కొనుగోలు చేసినవారికి రూ.3 వేల వరకు ఇన్‌స్టంట్ డిస్కాంట్‌తోపాటు రూ.4,999 విలువ కలిగిన స్మార్ట్‌వాచ్‌ను ఉచితంగా అందిస్తున్నట్లు బిగ్‌'సి' ఫౌండర్, సీఎండీ బాలు చౌదరి తెలిపారు. వీటితోపాటు స్మార్ట్ ఫోన్ కొనుగోలుపై రూ.1,10,000 విలువైన హెల్త్ కేర్‌కు సంబంధించిన ప్రయోజనాలు కూడా కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చిన వివో ఎక్స్100 సిరీస్ స్మార్ట్‌ఫోన్‌తోపాటు రెడ్‌మీ నోట్ 13 సిరీస్ ఫోన్లు కూడా తమ స్టోర్లలో కూడా అందుబాటులో ఉంచామని ఆయన పేర్కొన్నారు.

- ప్రతి మొబైల్/స్మార్ట్ టీవీ/ల్యాప్‌టాప్ కొనుగోలుపై ఖచ్చితమైన బహుమతి
- ఐఫోన్ కొనుగోలు చేసినవారికి రూ.4 వేల వరకు ఇన్‌స్టంట్ డిస్కాంట్
- వివో, ఒప్పో మొబైళ్ల కొనుగోళ్లపై 10 శాతం వరకు క్యాష్ బ్యాక్

- వన్‌ప్లస్, రియల్‌మీ మొబైళ్లపై రూ.3 వేల వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్
- బ్రాండెడ్ యాక్సెసిరీస్లపై 51 శాతం వరకు డిస్కాంట్
- రూ.9,999 విలువ కలిగిన ఫైర్ బోల్ట్ స్మార్ట్ వాచ్ జోడీ ఆఫర్‌ని కేవలం రూ.1,999కే
- రూ.7,999 విలువ కలిగిన ఫైర్ బోల్ట్ స్మార్ట్ వాచ్+ ఇన్‌బేస్ టీడబ్ల్యూఎస్ బడ్స్(1+1) కేవలం రూ.1,799కే
- ఏటీఎం కార్డుపై ఎలాంటి వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండానే మొబైల్, స్మార్ట్ టీవీ, ల్యాప్‌టాప్‌లు కొనుగోలు చేయవచ్చును.

నిరాశాజనక ఫలితాలే..

నేడు టీసీఎస్, ఇన్ఫోసిస్ క్యూ3 రిజల్ట్స్

న్యూఢిల్లీ, జనవరి 10: యూఎస్, యూరప్‌లో ఐటీ సర్వీసులకు డిమాండ్ మందకొడిగా ఉన్నందున, దేశీయ ఐటీ దిగ్గజాలు టీసీఎస్, ఇన్ఫోసిస్ ఆర్థిక ఫలితాల్లో మెరుపులేవీ ఉండవని పలు బ్రోకరేజ్ సంస్థలు అంచనా వేస్తున్నాయి. పైగా పశ్చిమ దేశాల్లో డిసెంబర్ నెలలో అధికశాతం ఉద్యోగులు సెలవుల్లో వెళతారు. దీంతో సాధారణంగా ఐటీ కంపెనీలకు క్యూ3 బలహీనమైన త్రైమాసికంగా పరిగణిస్తారు. ఈ నేపథ్యంలో ఈ రెండు దిగ్గజ కంపెనీల ఆదాయ, లాభాల్లో వృద్ధి అంతంతమాత్రంగానే ఉంటుందని బ్రోకరేజ్‌లు భావిస్తున్నాయి. 2023 డిసెంబర్‌తో ముగిసిన మూడవ త్రైమాసికానికి టీసీఎస్, ఇన్ఫోసిస్‌లు గురువారం జనవరి 11న ఆర్థిక ఫలితాలు వెల్లడించనున్న నేపథ్యంలో 9 బ్రోకరేజ్ సంస్థల సగటు అంచనాలు ఇలా ఉన్నాయి..

టీసీఎస్

- సెప్టెంబర్ త్రైమాసికంతో (క్యూ2)తో పోలిస్తే క్యూ3లో ఆదాయం 0.7 శాతం పెరుగుదలతో రూ.60,119 కోట్లకు చేరుతుంది.
- లాభం కేవలం 1 శాతం వృద్ధితో రూ.11,446 కోట్లను అందుకోవచ్చు.
- గత ఏడాది క్యూ3 కంటే ఆదాయం 3.3 శాతం, లాభం 5.5 శాతం చొప్పున పెరుగుతుంది.
- బీఎన్‌పీ పారిబా, నోమురాలు మాత్రం ఆదాయ, లాభాలు క్షీణిస్తాయని అంచనా వేశాయి.
- టీసీఎస్ పొందిన డీల్స్ తక్కువగానే ఉంటాయని అంచనా. 8.5–9 బిలియన్ డాలర్ల కాంట్రాక్టులు సంపాదించి ఉంటుందని కొటక్ ఈక్విటీస్ అంచనా వేసింది.
- రూపాయి విలువ తగ్గుదలతో పాటు వ్యయాల్ని అదుపుచేసుకున్నందున, లాభాల మార్జిన్లు ఫ్లాట్‌గా లేదా స్వల్పంగా పెరగవచ్చు.
- ఇబిట్ మార్జిన్ 23.1–26.7 రేంజ్‌లో ఉంటుందన్నది విశ్లేషకుల అంచనా. ఇది క్యూ2లో 24.3 శాతంకాగా, నిరుడు క్యూ3లో 24.5 శాతం ఉన్నది.

ఇన్ఫోసిస్

- సాధారణంగా డిసెంబర్ త్రైమాసికం ఐటీ కంపెనీలు నిరుత్సాహకర పనితీరునే ప్రదర్శిస్తుంటాయి. అయితే అన్నింటికంటే ఇన్ఫోసిస్ ఫలితాలు అధమంగా ఉంటాయని అంచనా.
- ఆదాయ, లాభాలు, మార్జిన్లు క్షీణిస్తాయని మెజారిటీ బ్రోకరేజ్‌లు అంటున్నాయి.
- త్రైమాసిక వారీగా ఆదాయం 1.4–1.7 శాతం తగ్గుతుందని, నిరుడు క్యూ3తో పోలిస్తే 8 శాతం క్షీణిస్తుందని అంచనా.
- బ్రోకరేజ్‌ల సగటు అంచనాల ప్రకారం ఆదాయం రూ.38,641 కోట్లకు, నికర లాభం 2.2 శాతం తగ్గుదలతో రూ.6,078 కోట్లుగా నమోదుకావచ్చు.
- వేతన పెంపుదల కారణంగా టీసీఎస్‌కంటే ఇన్ఫీ లాభాల మార్జిన్లు తగ్గవచ్చు.
- ఈబీటా మార్జిన్ 21.2 శాతం నుంచి 20–20.5 శాతానికి క్షీణిస్తుంది.
- గత త్రైమాసికంలో 1.5 బిలియన్ డాలర్ల భారీ కాంట్రాక్టు రద్దు అయిన నేపథ్యంలో ఐటీ డిమాండ్‌పై ఇన్ఫోసిస్ జాగ్రత్తగా స్పందిస్తుందని అంచనా. యూఎస్, యూరప్, యూకేల్లో డిమాండ్ పరిస్థితులపై ఇన్ఫోసిస్ వెల్లడించే కామెంటరీపై మార్కెట్ ఆతృతగా ఎదురు చూస్తున్నది.
- క్యూ3లో బలహీన ఫలితాల్ని ప్రకటించినా, పూర్తి ఆర్థిక సంవత్సరానికి గైడెన్స్‌లో కోత విధించదని అంచనా. 2023–24లో ఆదాయం 1–2.5 శాతం రేంజ్‌లో వృద్ధిచెందవచ్చని, ఆపరేటింగ్ మార్జిన్లు 20–22 శాతం రేంజ్‌లో ఉంటాయని సెప్టెంబర్‌లో ఇన్ఫీ వెల్లడించింది.

సంగీతాలో రెడ్‌మీ నోట్ 13 5జీ

బెంగళూరు, జనవరి 10:సంగీతా మొబైల్స్‌లోనూ రెడ్‌మీ నోట్ 13 5జీ స్మార్ట్‌ఫోన్లు అందుబాటులోకి వచ్చాయి. బెంగళూరు యలహంకలో ఉన్న కంపెనీ స్టోర్‌లో ఈ స్మార్ట్‌ఫోన్ విడుదలైంది. నూతన సిరీస్‌లో భాగంగా రెడ్‌మీ..నోట్ 13, నోట్ 13 ప్రో, నోట్ 13 ప్రో ప్లస్ వంటి మాడళ్లను ప్రవేశపెట్టింది. 6.67 అంగుళాల ఫుల్ హెచ్‌డీ డిస్‌ప్లే, 5000 ఎంఏహెచ్ బ్యాటరీ, మీడియాటెక్ హెలియో 9200+ ప్రాసెసర్, 8జీబీ, 128 జీబీ మెమొరీతో లభించనున్నాయి.

వార్షిక ప్రీమియం కంటే వంద రెట్లు బీమా

హైదరాబాద్, జనవరి 10: కోటక్ మహీంద్రా లైఫ్ ఇన్సూరెన్స్ మార్కెట్లోకి టర్మ్ విత్ యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. యూనిట్–లింక్డ్ టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్‌తో వార్షిక ప్రీమియం కంటే వంద రెట్ల వరకు లైఫ్ కవరేజ్‌తో పాటు యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్(యులిప్) రాబడిని పొందే అవకాశాన్ని కస్టమర్లకు కల్పించింది. తీవ్రమైన అనారోగ్యం, ప్రమాదవశాత్తు మరణించిన వారికి కూడా వర్తించనున్నది. ఆర్థిక అత్యవసర పరిస్థితుల్లో డబ్బును విత్‌డ్రా చేసుకోవచ్చును.

ఏరోస్పేస్‌కు తెలంగాణ స్వర్గధామం

- **దేశంలోనే ఇక్కడ శక్తివంతమైన ఏరోస్పేస్ ఎకో సిస్టమ్**
- **2018, 2020, 2022లో కేంద్రప్రభుత్వ అవార్డులు**
- **అదానీ గ్రూప్ ద్రిష్టి 10 స్టార్ లైనర్ యూఏవీ ఆవిష్కరణలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**

అదానీ గ్రూపు ద్రిష్టి 10 స్టార్ లైనర్ ఆవిష్కరణలో రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు, తదితరులు

హైదరాబాద్, జనవరి 10(నమస్తే తెలంగాణ): ఏరోస్పేస్ రంగానికి తెలంగాణ స్వర్గధామమని, దేశంలోనే ఇక్కడ శక్తివంతమైన ఏరోస్పేస్ ఎకోసిస్టమ్ ఉన్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఏరోస్పేస్ తయారీ, సర్వీసింగ్, ఇంజినీరింగ్, శిక్షణ సంస్థలను నెలకొల్పడానికి రాష్ట్రంలో అనేక ఏరోస్పేస్ అనుబంధ పార్కులు ఉన్నాయని వివరించారు. ఏరోస్పేస్ ఉత్పత్తుల తయారీకి హైదరాబాద్ కేంద్రంగా మారిందని చెప్పారు. శంషాబాద్‌లోని అదానీ డిఫెన్స్, ఏరోస్పేస్ సెంటర్‌లో భారతీయ నేవీ కోసం అదానీ సంస్థ దేశీయంగా తయారుచేసిన ద్రిష్టి 10 స్టార్ లైనర్ మానవరహిత ఏరియల్ వాహనం (యూఏవీ) ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర పారిశ్రామిక విధానం ఇండస్ట్రీ ఫ్రెండ్లీగా ఉన్నదని తెలిపారు. ఏరోస్పేస్, విమానయాన, అంతరిక్ష పరిశ్రమల రంగానికి తెలంగాణ ముఖ్యమైన కేంద్రమని పేర్కొన్నారు. ఏరోస్పేస్ అనుబంధ రంగాలకు సంబంధించి తెలంగాణలో వెయ్యికిపైగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్‌ఎంఈ) పరిశ్రమలు ఉన్నాయని, స్థానిక ఎంఎస్‌ఎంఈ పరిశ్రమలు అంతర్జాతీయ ఏరోస్పేస్ సప్లయ్ చైన్‌లోకి వెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరుచూ ఒరిజినల్ పరికరాల తయారీదారుల (వోఈఎం)తో సప్లయ్ చైన్ ఈవెంట్లను నిర్వహిస్తున్నదని గుర్తుచేశారు.

రాష్ట్ర ఏరోస్పేస్ రంగానికి అనేక అవార్డులు

ఏరోస్పేస్ రంగానికి సంబంధించి తెలంగాణ రాష్ట్రం పౌర విమానయాన శాఖ నుంచి 2018, 2020, 2022లో ఉత్తమ రాష్ట్ర అవార్డులను అందుకున్నదని, 2016–2020 మధ్యకాలంలో రాష్ట్రం నెంబర్–1 ర్యాంకు సాధించిందని దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌ను భవిష్యత్‌లో తక్కువ ఖర్చుతో అయ్యే ఏరోస్పేస్ సిటీగా గుర్తించిన ఫైనాన్షియల్ టైమ్స్ ఎఫ్‌డీఏ.. తన అంతర్జాతీయ ర్యాంకింగ్‌లో మొదటి ర్యాంకు ఇచ్చిందని చెప్పారు. రక్షణ పరికరాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటుచేయడానికి అదానీ డిఫెన్స్, ఏరోస్పేస్ సంస్థ హైదరాబాద్‌ను ఎంచుకున్నదని, కేవలం 10 నెలల వ్యవధిలో యూఏవీల తయారీ కోసం మొదటి కార్బన్ ఏరోస్ట్రక్చర్స్‌ను నెలకొల్పిందని తెలిపారు. అదానీ సంస్థ హైదరాబాద్‌లో 25 సరఫరాదారులతో సంబంధాలు సాగిస్తున్నదని వివరించారు. ఆ సంస్థ డీఆర్‌డీవోకు ముఖ్యమైన భాగస్వామిగా వ్యవహరిస్తున్నదని చెప్పారు. మిసైల్స్ తయారీకి హైదరాబాద్ ఉత్పత్తి కేంద్రంగా మారిందని స్పష్టం చేశారు.

ఎస్‌హెచ్‌జీలకు రుణ సదుపాయం

న్యూఢిల్లీ, జనవరి 10: గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక బృందాలకు (ఎస్‌హెచ్‌జీలు) రుణ సదుపాయం కల్పించేందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఒక అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేసింది. స్వయం సహాయక బృందాల్లో మహిళా ఔత్సాహిక వాణిజ్యవేత్తల కోసం స్వయం సిద్ధ పేరుతో ఎస్బీఐ ఒక ప్రత్యేక స్కీమును ప్రవేశపెట్టింది. దీని కింద రూ. 5 లక్షల వరకూ రుణ సదుపాయం అందిస్తారు. బ్యాంక్ రుణ దరఖాస్తులతో ఎక్కువగా డాక్యుమెంట్లు సమర్పించడం, రుణ వితరణకు అధిక సమయం పట్టడం వంటి సవాళ్లను తొలగించేలా ఈ స్కీమ్‌ను డిజైన్ చేశామని ఎస్బీఐ సీజీఎం శాంతను పాండ్యే వివరించారు. స్థానిక ఎస్బీఐ శాఖల్లో కేవైసీ వివరాలతో రుణ దరఖాస్తును సమర్పించవచ్చని, ఇందుకోసం ప్రత్యేకించిన క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా రుణ చెల్లింపు ప్రక్రియ జరుగుతుందని వివరించింది.

సెలెక్ట్‌లో 'సూపర్ సంక్రాంతి సేల్'

హైదరాబాద్, జనవరి 10: మొబైల్ విక్రయ సంస్థ సెలెక్ట్..సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకొని 'సూపర్ సంక్రాంతి సేల్' పేరుతో ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. అన్ని స్మార్ట్‌ఫోన్లపై రూ.3 వేల వరకు తగ్గింపు ధరకే విక్రయిస్తున్న సంస్థ... హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కార్డులపై కొనుగోలు చేసిన వారికి 7.5 శాతం వరకు ఇన్‌స్టంట్ డిస్కాంట్, రూ.999 ప్రారంభ ధరతో బ్రాండెడ్ స్మార్ట్‌వాచ్, ఇయర్‌బడ్స్ రూ.799 నుంచి, ఎక్స్ఛేంజ్‌తో అన్ని బ్రాండెడ్లపై రూ.30 వేల వరకు తగ్గింపు ధరకే అందిస్తున్నది. ఎంపిక చేసిన స్మార్ట్‌ఫోన్‌ను కొనుగోలు చేసిన వారికి రూ.2,999కే స్మార్ట్ టీవీ/సౌండ్ బార్‌ను అందిస్తున్నది. మరోవైపు కంపెనీ రిటైల్ అవుట్‌లెట్‌లో రెడ్‌మీ నోట్ 13 5జీ ఫోన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సందర్భంగా సంస్థ ఈడీ మురళీ రేతినేని మాట్లాడుతూ..కస్టమర్లకు ఎప్పటికప్పుడు కొత్త టెక్నాలజీని, కొత్త మాడళ్లను ప్రవేశపెట్టడంలో సెలెక్స్ మొబైల్స్ ముందువరుసలో ఉంటుందని, ఇదే ఒరవడిని కొనసాగిస్తూ రెడ్‌మీ నోట్ 13 5జీ ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ సరికొత్త స్మార్ట్ ఫోన్ తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర రాష్ట్రాల్లో ఉన్న రిటైల్ అవుట్‌లెట్లలో లభించనున్నదన్నారు. 6.67 అంగుళాల టచ్‌స్క్రీన్ తయారు చేసిన ఈ నోట్ 13 ఫోన్లో 5000 ఎంఏహెచ్ బ్యాటరీ, మీడియా టెక్, 8జీబీ/128 జీబీ వంటి ఫీచర్‌తో రూపొందించింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.